సిలికానాంధ్ర నిర్వహించిన జానపద గీత రచన పోటీలో ప్రోత్సాహక బహుమతి పొందిన పాట

# కొండమల్లి

-వారణాసి నాగలక్ష్మి

ఆమె : వెన్నలాంటి మనసున్న చిన్నయ్యా,
నీవెన్నంటే ఉంటాను చిన్నయ్యా!
నన్ను కాదన బోకు చిన్నయ్యా,
మరులు గొలిపి మరచిపోమనరాదయ్యా!

అతడు: పొన్నపూల వన్నెదాన చిన్నదాన
పూవల్లె నవ్వేటి కుర్రదాన
మనసుంటే చాలదులే వెర్రిదానా!
సిరిలేని మనసేటికి ఎవ్వరికైనా!

ఆమె: పొలం గట్ల పోతుంటె చిన్నయ్యా
ముద్ద బంతి పువ్వు తెచ్చి ఇచ్చానయ్య
(నీ) పువ్వంటి నవ్వు చూసి మురిశానయ్య
ఆ కొంటె కళ్ళ మెరుపు చూసి వలచానయ్య
మనసులేని మనువెందుకు చిన్నయ్యా!
ప్రేమ లేని పెన్నిధి నాకొద్దు లేవయ్యా
సిరులొద్దుగిరులొద్దు చిన్నయ్యా
చిరునవ్వుల మరుమల్లెలు చాలయ్యా! ||వెన్న||

అతడు: మబ్బుల్లే అల్లుకున్న బారెడు జడలో
చామంతి పూలు ముడిచి నడిచొచ్చేవు
చుక్కల్లా మెరిసేటి కాటుక కళ్ళు
అద్దాలను మరిపించే లేత చెక్కిళ్ళు

సిరులిచ్చే లచ్చిమిలా నువ్వెదురొస్తే
సిరులేటికి గిరులేటికి చిన్నదానా!
మనసుంటే చాలంటే చిన్నదానా
నీ చేయందుకు చక చకా సాగిపోనా ? ||పొన్న||

అతడు: కొండమల్లి పూలు కోసి ఇవ్వగలనే
కొండరాళ్ళు పిండి పిండి చెయ్యగలనే
గుండె నిండ ప్రేమైతే ఉందిగానీ
మండువా ఇల్లే లేదు చిన్నదానా!

ఆమె: కొండ పిండి చేసేటి కండలుంటే,
కొండమల్లి కోసిచ్చే సరసముంటే,
మండువా, మేలిముసుగు నాకొద్దయ్యా
నీ గుండెలోనె గూడు కట్టుకుంటానయ్యా! ||వెన్న||

పల్లవి. ఆమె: వెన్నలాంటి మనసున్న చిన్నయ్యా
నీ వెన్నంటే ఉంటాను చిన్నయ్యా!

అతడు: సిరులిచ్చే లచ్చిమిలా నువ్వెదురొస్తే
సిరులేటికి గిరులేటికి !చిన్నదానా

ఆమె: నన్ను కాదనబోకు చిన్నయ్యా!
మరులు గొలిపి మరచిపోమన రాదయ్యా!

అతడు: మనసుంటే చాలంటే చిన్నదాన!
నీ చేయందుకు చక చకా సాగిపోనా? ||పొన్న||

వక్కలంక సూర్య సంగీత దర్శకత్వంలో సూర్య, అక్కినేపల్లి మాధురి పాడిన ఈ పాట వినడానికి ఇక్కడ క్లిక్ చేయండి

Varanasi Naga Lakshmi
303, Edaikode Towers,
Srinagar colony,
Hyderabad-500073
India.
Ph no.23732745

